

మహాభాష్యం నరసింహారావు

'కార్యేషు మంత్రి, భోజ్యేషు మాతా, శయనేషు రంభ, క్షమయా ధరిత్రి'... అని భార్య గుణగణాలు ఎలా వుండాలో మన పూర్వీకులు నిర్వచించారు. జీవితంలో చక్కని అనుకూలవతియైన భార్యను పొందడం కూడా అదృష్టంగానే చెప్పాలి. 'మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని పెద్దలు ఎప్పుడో చెప్పారు. మగవారు మంచి భార్యకావాలనీ ఎలా ఆశిస్తారో, ఆడవారు కూడా మంచి భర్త లభించాలని, అతను ధనవంతుడు, గుణవంతుడు కావాలని అభిలషిస్తారు. కానీ అందరికీ ఇది గగనకుసుమమే! పుణ్యాంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు అని కూడా మనవాళ్ళు చెప్తుంటారు.

నేను ఈ మధ్య సంక్రాంతి పండుగలకి ఇంటికి వెళ్ళినపుడు మా అమ్మగారు నా పెళ్ళి ప్రస్తావన తెచ్చారు. నాకూ పెళ్ళి చేసుకోవాలని, భార్యతో అచ్చట్లు ముచ్చట్లు తీర్చుకోవాలని కోరిక వుంది. ఆఫీసు నుండి ఇంటికి వస్తే ఏదో వెలితిగా ఫీలవుతున్నాను. ఆఫీసు నుండి అలసివచ్చిన నాకు, ఇంటికి వచ్చేసరికి గుమ్మం దగ్గరే చిరునవ్వుతో స్వాగతం పలుకుతూ ఆదరించి, కప్పు కాఫీ అందించి సేద తీర్చే భార్య కావాలని చాలా సార్లు కలలు కన్నాను. కానీ నాపై వున్న బాధ్యతలు పెళ్ళి తలంపును కొన్నాళ్ళు దూరంగా వుంచేయి. ఇంజనీరింగు, మెడిసిన్ చదువుతున్న తమ్ముళ్ళిద్దరున్నారు. పెళ్ళి చేయవలసిన చెల్లెలు ఒకామె వుంది. నాన్నగారిది గుమాస్తా ఉద్యోగం అవడం వలన ఆయన తమ్ముళ్ళని పెద్దగా చదివించే స్థితిలో లేరు. నేను సాయం చేయకపోతే వారి చదువులు అర్ధాంతరంగా ఆగిపోతాయి. వారిని చదివించి నాకన్నా వారిని ఉన్నతులను చేయాలని నా జీవితాశయం.

నా చిన్నతనంలో చాలా మంది పెళ్ళి చేసుకున్నాక భార్యలు సహకరించనందున వేరింటి కాపురాలు పెట్టించడం, ఇంట్లో దేనికో దానికి చీటికి మాటికీ పోట్లాడుకోవడం, ఏవో గొడవలతో వారి కుటుంబాలు అశాంతితో అలమటించడం నా కనులారా చూడడం వలన నాకు వచ్చే భార్య ఎటువంటిది వస్తుందోనని భయంతో పెళ్ళి చేసుకోడానికి సాహసించలేకపోతున్నాను.

* * *

నాకు పాతికేళ్ళు నిండేయని, ఇక ఆలస్యం చేయడం తగదని మా అమ్మగారు కొంచెం ఘాటుగా ఉత్తరం రాసేసరికి నాలో వేడి పుట్టింది. వెంటనే మంచి సంబంధం ఏదైనా వుంటే వచ్చి పెళ్ళిచూపులు చూస్తానని మా నాన్నగారికి ఉత్తరం రాసిపడేశాను.

వారంరోజుల తరువాత తునిలో ఒక మంచి సంబంధం వుందని, వెంటనే పెళ్ళిచూపులకోసం బయలుదేరి రమ్మనమని నాన్నగారు ఉత్తరం రాశారు.

నేను, మా అమ్మగారు, నాన్నగారు, చెల్లెలితో కలిసి తుని వెళ్ళి అమ్మాయిని చూశాము.

అమ్మాయి లక్షణంగా చూడముచ్చటగా వుంది. బి.ఏ. ఫైనల్ ఇయరు చదువుతోంది. తెల్లగా నాజూగ్గా, సన్నగా, పొడుగ్గా, సన్నజాజి తీగెలా ఎంతో అందంగా వుంది. మా వాళ్ళందరికీ అమ్మాయిని చూడగానే నచ్చింది. అమ్మాయి పేరు కూడా మృదుమధురంగా 'మంజుల' అని చెప్పారు.

పెళ్ళికూతుర్ని చూసి అంతా రాత్రి టాక్సీలో ఇంటికి తిరిగి వచ్చాము. ఇంట్లో అంతా పెళ్ళి కుదిరినట్లు, ముహూర్తాల గురించీ, కట్నకానుకల గురించి ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

మా చెల్లి నా దగ్గరికి వచ్చి, 'అన్నయ్యా మాకు మంచి వదిన దొరికినందుకు ప్రెజెంటేషన్ ఏమిస్తావని' అడిగింది.

నేను నవ్వుతూ, 'నాకు అసలు అమ్మాయి నచ్చలేదు. నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడంలేదని' చెప్పాను.

'సీరియస్‌గా అడుగుతున్నాను. జోక్ చేయకు' అంది.

'నిజమేనమ్మా! నేనూ సీరియస్‌గా చెప్తున్నాను. ఎందుకో ఆ అమ్మాయి నాకు తగిన భార్యగా అనిపించడంలేదు' అన్నాను.

అంతే మా చెల్లి ఒక్కసారి అవాక్కయి మరల తేరుకొని, 'అమ్మా! అన్నయ్యకి పెళ్ళికూతురు నచ్చలేదుట' అని గట్టిగా కేక వేసింది.

వంటగదిలో నుండి మా అమ్మగారు పరుగెత్తుకొంటూ వచ్చారు. నా ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ, 'నిజమే చెప్తున్నావా?' అని అడిగారు.

'ఔను నిజంగానే చెప్తున్నాను. అమ్మాయి బాగుంది. కాని నాకు భార్యగా తగదనిపిస్తోంది. ఆ అమ్మాయి నా పక్కనుంటే కాకి ముక్కుకి దొండ పండులా వుంటుంది. అందుకే నాకు ఇష్టంలేదు! అన్నాను.

మా అమ్మగారు ఆశ్చర్యంగా నా వైపు చూసి, 'ఎవరైనా అందమైన పెళ్ళాం కావాలని కోరుకుంటారు. కానీ నీ మాటలు విచిత్రంగా వున్నాయి' అన్నారు.

ఇంతలో మా నాన్నగారు అక్కడికి వచ్చి, 'వాడి ఉద్దేశ్యం 'బహుశా భార్యారూపవతీ, శతృవుః' అని



ఆలోచించి వుంటా'డన్నారు.

మరల మా నాన్నగారే కల్పించుకొని! ఒక రకంగా ఆలోచిస్తే మనం అలాంటి అమ్మాయిని మనింటి కోడలుగా తెచ్చుకున్నా ఆ అమ్మాయి సుఖపడదు! అన్నారు.

'ఎక్జాట్లీ నాన్నగారూ! నా ఉద్దేశం కూడా అదే! అందుకే ఆ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోవడం లేదని' నిక్కచ్చిగా చెప్పేశాను.

ఒక్కసారి ఇంట్లో అందరి ముఖాల్లో సంతోషం మాయమై నిశ్శబ్దం చోటు చేసుకుంది.

✣ ✣ ✣

కాల చక్రం గిర్రున నాలుగు నెలలు తిరిగింది. ఒక రోజు నాన్నగారి నుండి పెళ్ళిచూపులకు రమ్మనమని, మంచి తెలిసిన సంబంధం వచ్చిందని వ్రాశారు.

నేను శలవు పెట్టి, ఉద్యోగానికి కొత్తగా ఇంటర్వ్యూకి వెళ్తున్నట్లు ఒకరకమైన పిరికితనంతో పెళ్ళి చూపులకు బయలుదేరాను.

ఈ సారి నా వెంట అమ్మ, నాన్నగారు పెళ్ళి చూపులకు శ్రీకాకుళం వచ్చారు. మా చెల్లికి పరీక్షల వడం వలన మా వెంట ఆమె రాలేదు.

మేము అమ్మాయి వాళ్ళింటికి వెళ్ళగానే వారు సాదరంగా ఆదరించి మర్యాదచేశారు. కాఫీ, ఫలహారాలు పూర్తయ్యేక అమ్మాయిని తీసుకువచ్చి చూపించారు.

పెళ్ళికూతురు చామన ఛాయ రంగులో చిరునవ్వు ముఖం, సోగకళ్ళతో నాకళ్ళకు అందంగా కన్పించింది. "తావలచినది రంభ, తామునిగింది గంగ" అని మన వాళ్ళు ఊరకే అనలేదు. అమ్మాయి చదువు కూడా నా కోరికకనుగుణంగా టెన్త్‌క్లాసు వరకే చదివింది. మా అమ్మగారు అడిగిన ప్రశ్నలకు చక్కగా సమాధానం చెప్పింది. పాట పాడమంటే, తీయని కంఠంతో 'సీతమ్మ మాయమ్మ, శ్రీరాముడు మాకు తండ్రి' అని మృదుమధుర స్వరంతో ఆలపించింది.

ఎందుకో మా తొలి చూపులలోనే ఆమె నాకు తగిన భార్య అనిపించింది. ఇంటికి చేరగానే, 'అమ్మాయి నచ్చిందని, మిగతా విషయాలు మీరు చూసుకోమని' చెప్పి ఆ రాత్రే విజయవాడ తిరిగి వచ్చాను.

✻ ✻ ✻

ఒకొక్కసారి పెళ్ళి గురించి ఆలోచిస్తే ఎంతో సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. ఒక ఇంట్లో ఒక రకమైన వాతావరణంలో సుమారు ఇరవై సంవత్సరములు పెరిగిన అమ్మాయి, ముక్కు, ముఖం తెలియని వ్యక్తితో పెద్దల ఆశీర్వచనాలతో మూడు ముళ్ళుపడగానే, కన్నవారిని, పుట్టి పెరిగిన ఊరిని వదలి వచ్చి కొత్త ఊళ్ళో, కొత్త మనుషుల మధ్య, కొత్త వాతావరణంలో భర్తతో అతనే సర్వస్వమని నమ్మి అతనితో కాపురం చేస్తుంది. అనతి కాలములో అందరిలో కలిసిపోయి, ఆ కుటుంబంలో ముఖ్యస్థానాన్ని సంపాదిస్తుంది. మన హిందూ సాంప్రదాయం ప్రకారం ఇలా పెళ్ళిళ్ళు చేసినా నూటికి తొంభైతొమ్మిదిమంది హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు.

విదేశాలలో, నేడు మనదేశంలో కూడా ప్రేమించి పెళ్ళిచేసుకొంటున్నారు. ప్రేమించి పెళ్ళిచేసుకున్న జంటలు కూడా నూటికి తొంభై శాతం మించి సరిగా కాపురాలు చేయడంలేదు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసేవారే ఎక్కువ మంది విడాకులు తీసుకొని విడిపోతున్నారు. అందుకే తగిన భార్య దొరకడం కూడా పూర్వజన్మ సుకృతంగా భావిస్తారు.

సుశీలతో నా వివాహము వైభవంగా జరిగింది. కొందరు తల్లిదండ్రులు పిల్లలు పుట్టగానే చక్కటి పేర్లు పెడ్తూ వుంటారు. నా భార్యకు సుశీల అనే పేరు ఆమె గుణగణాలకు సరిపోయేటట్లు మామగారు ఆమెకు పెట్టారు. పెళ్ళయ్యాక మొదటి రాత్రి నాడే సుశీలకి మా కుటుంబంలో అందరి గురించి చెప్పి, ఐదు సంవత్సరాల వరకు కొంచెం ఓపిక వహించి, కొన్ని కోరికలు, సుఖాలను పరిత్యజించి త్యాగం చేయవలసి వస్తుందని, తమ్ముళ్ళ చదువులు, చెల్లెలు పెళ్ళి అయాక జీవితం ఆనందంగా గడపవచ్చని అంతవరకు నాతో సహకరించవలసినదిగా నా సహధర్మ చారిణియైన సుశీలని అర్థించాను. ఆమె నన్ను అర్థంచేసుకుని, నా అడుగుజాడలలో నడుస్తానని మాట ఇచ్చింది. ఆమె మాటతో నాకు కొండంత ధైర్యం వచ్చింది.

మొదట తిరుపతి వెళ్ళి వెంకన్న దేవుని దర్శించుకొని, అక్కడనుండి హనీమూన్‌కి భూతల స్వర్గాన్ని మైమరిపించే మైసూరు, బెంగుళూరు, ఊటీ తీసుకు వెళ్తానని ఆమెకు చెప్పి, ఆమె భయము, బిడియము పోగొట్టి ఆమెను నా స్వంతం చేసుకున్నాను.

పెళ్ళి తతంగాలు పూర్తయ్యేక ఆచారాల మేరకు ఏనాళ్ళకు మూడురోజులు మా ఇంట్లోను మా అత్తగారింట్లోను వేడుకగా జరిపించారు. తరువాత మా హనీమూన్ విషయము మెల్లగా మా అమ్మగారికి చెప్పాను. పక్కనేవున్న నా చెల్లెలు నా మాటలు విని, 'ఇప్పటికే బోలెడు ఖర్చులయ్యాయి. వాళ్ళిచ్చిన కట్నం డబ్బులు చాలక ఐదువేలవరకు నాన్నగారు అప్పుచేయవలసి వచ్చింది. ఇప్పుడు బెంగుళూరు, మైసూరు వెళ్ళకపోతే ఏం?' అంటూ నిలదీసింది.

ఆమె మాటలతో నాలో ఉత్సాహమంతా ఎగిరిపోయింది. పక్కనున్న మా అమ్మగారు మాట్లాడకపోవడంతో వెనుతిరిగి వెళ్తూవుంటే, 'బాబూ! చెల్లి చెప్పినట్లు ఇప్పుడు చాలా ఖర్చుల్లో వున్నాం కాబట్టి, తిరుపతి వెళ్ళి దేవుణ్ణి చూసి వచ్చేయండి. తరువాత ఎప్పుడైనా తీరిగ్గా మీరనుకున్నట్లు మైసూరు, బెంగుళూరు వెళ్ళిరండి'. అన్నారు. 'అలాగే' అని చెప్పి పాలిపోయిన ముఖంతో నా శ్రీమతికి ఈ విషయం మెల్లగా చెప్పలేక చెప్పాను.


సుగుణాలరాశియైన నా సుశీల నన్ను అర్థం చేసుకొని కినుకవహించకుండా చిరునవ్వుతో, 'అలాగే చేద్దాం! దాని గురించి విచారించకండి' అని నన్ను ఓదార్చింది. ఆమె మాటలు నాకు పన్నీరు జల్లుగా అనిపించి ఆనందాన్ని కలిగించింది.

✻ ✻ ✻

మా తిరుపతి యాత్ర పూర్తయ్యాక మా అమ్మగారు విజయవాడ వచ్చి మా చేత కొత్త కాపురం పెట్టించారు. మా అమ్మగారు నాలుగు రోజులుండి వెళ్ళిపోయారు. మా హనీమూన్ ఆనందాన్నంతా ఇంట్లోనే జరుపుకున్నాము.

నాకు చిన్నప్పటినుండి పిల్లలంటే మక్కువ. నా బాల్యంలో మా తమ్ముళ్ళు, చెల్లిని ఎత్తుకొని ఆడించేవాణ్ణి. మా అమ్మగారు నా సరదా చూసి, 'తొందరగా పెళ్ళిచేసుకుంటే మనింట్లో కూడా ఒక పసికూన వస్తుంది కదరా!' అంటూ వుండేది.

అందుకే ఒకరోజు మాటలలో సుశీలతో ఇలా అన్నాను. ముచ్చటగా ముగ్గురు పిల్లల్ని కని ఇమ్మన్నాను. అందులో ఇద్దరు కొడుకులు, ఒక కూతురు కావాలని చెప్పాను. సుశీల ముఖం సిగ్గుతో ఎర్రబడింది. తలదించుకొని తనలో తాను ముసిముసి నవ్వులు నవ్వుకోవడం చూసి! 'ఏం నా కోరిక నీకు దురాశగా కనిపిస్తోందా! నాకు ఇద్దరు



కొడుకులు పుడితే ఒకణ్ణి ఇంజనీరు, మరొకణ్ణి డాక్టరుని చేస్తానని గర్వంగా చెప్పాను. 'అంతా మీ చేతులలో వున్నట్లే మాట్లాడుతున్నారు. మరి అమ్మాయి సంగతి చెప్పలేదేమిటి?' అని అడిగింది చిలిపిగా నవ్వుతూ.

'అమ్మాయికి గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను.' అన్నాను గర్వంగా.

నా శ్రీమతి ఇల్లు అదిరిపోయేటట్లు గట్టిగా నవ్వింది. నేనూ ఆమె నవ్వుతో శృతికలిపాను. 'ఆలూ లేదు. చూలు లేదు. కొడుకుపేరు సోమలింగమని' ఊరకే అనలేదు. వెనుకటికి మనలాటి వాళ్ళని చూసే ఆ సామెత పుట్టి వుంటుంది. అంది వెటకారంగా.

నేను కొంటెగా, "ఆలు లేకపోవడమేమిటి? చూలే లేదు. చూలు వస్తే ఎంతసేపు కావాలి పిల్లలు కనడానికి' అన్నాను.

నా మాటలకు సుశీల సిగ్గుతో మెలికలు తిరిగి పడకగదిలోకి తుర్రుమంది. నేనూ ఆమెను అనుసరించాను.

❊ ❊ ❊

సుశీల పాలల్లో పంచదారలాగ నాలో బాగా కలిసిపోయింది. కష్టసుఖాలలో నాతో కలిసి సమంగా పంచుకోసాగింది.

ఒకసారి బీరువా కొందామని డబ్బులు కూడబెట్టాము. మా డాక్టరు తమ్ముడు ఏవో పుస్తకాలు కొనుక్కోవాలని డబ్బుకావాలని ఉత్తరం రాస్తే సుశీల ముందు వెనక ఆలోచించకుండా వెంటనే తమ్ముడికి డబ్బులు పంపేవరకు ఊరుకోలేదు.

ఇంకొకసారిలాగే గ్యాస్‌స్టవ్ కొందామని డబ్బులు కూడ బెడితే ఇంజనీరింగు చదువుతున్న తమ్ముడు స్టడీటూరు వెళ్తున్నానని ఉత్తరం రాసేసరికి తనే ముందుగా డబ్బుతెచ్చి పంపించేటట్లు చేసింది.

ఇలా చెప్పాలంటే సుశీల చేసిన త్యాగాలు, ఆమె ప్రదర్శించిన అభిమాన జల్లులు చాలా ఉన్నాయి.

మా పెళ్ళయి మూడు సంవత్సరాలయింది. కానీ నా శ్రీమతికి నా చేత్తో ఒక విలువైన వస్తువు కూడా కొనలేదు. ఏదో బంగారు నగ కొని కానుకగా ఆమెకివ్వాలని తలంపుకలిగి ఆమెను అడిగాను. ఆమె సంతోషించి శ్రావణమాసం వరలక్ష్మీ వ్రతానికి నల్లపూసల గొలుసు చేయించమని కోరింది.

వేమా ఆమెకి నల్లపూసలు చేయించి కానుకగా ఇవ్వాలనుకున్నాను. 'తానొకటి తలచిన దైవమొకటి తలచినట్లు' మా చెల్లి





దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఉత్తర సారాంశమేమంటే, నా పెళ్ళికి నాన్నగారు చేసిన అప్పు ఇంకా తీరలేదని, నెలనెలా వడ్డీలు కడ్తున్నారని, ఆ అప్పు తొందరగా తీరిస్తే బాగుంటుందని, నాన్నగారు ఉత్తరం రాయడానికి సందేహిస్తున్నారని, అందుకే తను ఉత్తరం రాసినట్లు, తప్పక అప్పు తీర్చేటట్లు చూడమని వ్రాసింది.

నేను అంతవరకు తమ్ముళ్ళ చదువులకు వారి హాస్టలు ఖర్చులు, కాలేజీ ఫీజు పంపుతున్నాను కానీ ఇంటికి పైసా పంపడంలేదు. మా నాన్నగారు ఎన్నడూ అడగలేదు. తప్పనిసరి పరిస్థితులలో మా అమ్మగారే చెల్లితో ఉత్తరం వ్రాయించి వుంటారని గ్రహించాను. ఆలోచనతో సతమతమౌతున్న నా దగ్గరకి శ్రీమతి కాఫీ కప్పుతో వచ్చి, 'ఎందుకలా దిగులుగా కూర్చున్నారు. ఇక ఒక సంవత్సరములో మన కష్టాలు గట్టెక్కుతాయి. వచ్చే సంవత్సరం ఎలాగూ మీ డాక్టరు తమ్ముడు చదువు పూర్తి అవుతుంది కాబట్టి మనకి కొంత భారము తగ్గుతుంది కదా! అని సముదాయించి నల్లపూసలు కావలిస్తే వచ్చే సంవత్సరం చేయించుకోవచ్చు. ముందు అప్పు తీరే మార్గము చూడండి. అనవసరంగా వడ్డీలకు డబ్బు పోస్తున్నారు. అని సలహా ఇచ్చింది.

ఆమె ఔదార్యానికి నా కళ్ళు చెమర్చాయి. ఆమెను ప్రేమతో కౌగిలిలో చేర్చి ముద్దుల వర్షం కురిపించాను.

❊ ❊ ❊

మా పెళ్ళయిన ఐదు ఏళ్ళలో నా శ్రీమతి నాకు బహుమానంగా ముగ్గురు పిల్లల్ని కని తన ప్రతాపం చూపించింది. నా కోరిక మేరకు కాకుండా ముగ్గురూ అమ్మాయిలే అవడం విశేషం. మూడవ సారి కూడా ముచ్చటగా అమ్మాయి పుట్టడంతో ముందు వెనుక ఆలోచించకుండా, పెద్దలు వారించినా వినకుండా ఫుల్‌స్టాప్ పెట్టాము.

పున్నామ నరకం సంగతి ఎలాగవున్నా, ఇక్కడ నరకాన్ని అనుభవించడానికి ఇష్టంలేక మరి కొడుకు కోసం చూడకుండా, ముందు చూపుతో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకున్నాము.

ముగ్గురూ ఆడపిల్లలైనా ముత్యాల్లాంటి పిల్లలు పుట్టారు. వారిని చూశాక నాకు కొడుకుల్లేరని చింత కలుగలేదు. కానీ మాపై సానుభూతి చూపేవారు మాత్రం ఎక్కువయ్యారు.

మా చెల్లెలు పెళ్ళికాగానే ఇక మా అమ్మాయిల పెళ్ళిళ్ళకోసం వారికి మూడవ సంవత్సరం వచ్చిన దగ్గరనుండి ప్లాన్ చేసి వాళ్ళ పెళ్ళిళ్ళకోసం డబ్బు దాచడం ప్రారంభించాము. నా శ్రీమతి సహకారం లేనిదే నేను అడుగు ముందుకు వేయలేను. అందుకే ఆమె అంటే నాకు ఇష్టం.

ఎన్ని కష్టాలు వచ్చినా చిరునవ్వు ముఖంతో ఎంతో ధైర్యంగా ఎదుర్కొని నన్ను ముందుకు నడిపించే శ్రీమతికి నా జోహార్లు. హేట్సాఫ్ టు శ్రీమతి. ❊

## గోవిందా కాకా

"గోవిందా కాకాపడితే ఎవరయినా పడిపోవాల్సిందే అతనికి అంత బాగా పొగడ్డం తెలుసు.

అవి పొగడ్తల్లా వుండవు. సిన్సియర్‌గా చెప్తున్నట్లనిపిస్తుంది. ఈ ప్రపంచంలో ఇంత మంచి మనుషులుంటారా? అన్న ఆశ్చర్యం కూడా కలుగుతోంది. అందుకే గోవిందాకి అంత మంది ఫ్రెండ్స్" అంటోంది సెలీనా జైట్లీ.

(ఇంకా పడిపోయేదేముంది? ముందుగా తెలుసుకున్నావుగా!)